## క్లుప్తంగా

### మానవ సేవే మాధవ సేవ..

పార్వతీపురం టౌన్: మానవ సేవే మాధవ సేవని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు, కర్షక మహర్షి ఆస్పత్రి వైద్యుడు డి. రామ్మోహనరావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటకళ్యాణ మండపంలో మన్యం జిల్లా పీఎంపీల అసోసియేషన్ రెండో వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో పీఎంపీలు తమవంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. కరోనా సమయంలో విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో భరద్వాజ, సింహాచలం, వి. శంకరరావు, ఎస్. గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన తప్పనిసరి

- సీఐ అప్పలనాయుడు

సాలూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పట్టణ సీఐ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్ క్లబ్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, డ్రగ్స్, నూతన చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే హెల్ప్‌లైన్ నంబర్లు, వాటి ఆవశ్యకతను వివరించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

### సారా స్వాధీనం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఎక్సైజ్ పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించామని ఎక్సైజ్ ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. పార్వతీపురం మండలం గంగాపురం దాడులు నిర్వహించి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, ఈ సందర్భంగా నిందితులు నిమ్మక సావిత్రమ్మ, మర్రి రాముడమ్మపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే కొమరాడ మండలం గుమడ గ్రామానికి చెందిన వెలగాడ సింహాద్రి, పాలకొండ మహేంద్రల నుంచి 700 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

- తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కొత్తవలసలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సంబంధిత సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం పలువురు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్. శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్, వీఆర్వోలు, సర్పంచ్ ఆర్. అనిత, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### త్వరితగతిన రిజిస్ట్రేషన్లు



బలిజిపేట ఉన్నత పాఠశాలలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: పరీక్ష పే చర్చ రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ–1 సామల సింహాచలం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో పరీక్ష పే చర్చ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరు నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రుల వివరాలను రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి పరీక్షా పే చర్చలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ఎంఈఓ–2 శ్రీనివాసరావు మండలంలోని చిలకలపల్లి, అంపావల్లి పాఠశాలలను పర్యవేక్షించారు.

### వేగవంతంగా హౌస్‌హోల్డ్ సర్వే

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న హౌస్‌హోల్డ్ సర్వే పనులు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట, ఇప్పవలస, పాపమ్మవలస, నిడగల్లు గ్రామాల్లో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు, పీపీఎస్ సీఈఓలు, వెల్ఫేర్ సహాయకులు, సచివాలయ సర్వేయర్లు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

### ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ

సీతానగరం: ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను, సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టగలమని ఏఎస్సై ఎల్. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహన చోదకులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించని వారి నుంచి అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో మహిళా హెచ్‌సీ ఎం. సుజాత, ఎం. నరేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- కూటమి పాలనలో బాదుడేబాదుడు ..
- వినియోగదారుల నడ్డి విరిచేలా విద్యుత్ బిల్లుల పెంపు
- చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాట
- ప్రశ్నిస్తానన్న పవన్‌కల్యాణ్‌కు ఈ బాదుడు కనిపించలేదా : మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

# బాబు మార్కు షాక్

సాలూరు:

చంద్రబాబు పాలన బాదుడు పాలనగా మారిందని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఏడీఏ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. వందలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వినియోగదారుల సమక్షంలో రాజన్నదొర మాట్లాడుతూ.. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన కూటమి నాయకులు తీరా అధికారంలోకి వచ్చాక ఇష్టానుసారంగా రేట్లు పెంచేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయల భారం మోపి వినియోగదారుల నడ్డి విరిచారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో దళితులు, గిరిజనులకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలైతే నేడు వారికి షాక్ కొట్టేలా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శీతాకాలంలో చలికి వణికిపోవాల్సిన ప్రజలు విద్యుత్ బిల్లులు చూసి వణికిపోతున్నారన్నారు. నవంబర్ నెలలో వినియోగదారుల నుంచి 6072.86 కోట్లు అదనంగా వసూలు చేశారన్నారు. డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించి 9,412.50 కోట్ల భారం మోపనున్నారని ఆరోపించారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేటప్పటికి అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం సుమారు 20 వేల కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీలు అంటగట్టిందన్నారు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం సుమారు రూ. 13,255.76 కోట్లు మాత్రమే సబ్సిడీల కింద చెల్లించగా.. 2019 – 24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు 47,800.92 కోట్ల రూపాయల సబ్సిడీ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. 2014 –19 మధ్య చంద్రబాబు రైతులకు ఎగ్గొట్టిన విద్యుత్ బకాయిల రాయితీలను రూ. 8,845 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.

**200 యూనిట్లు ఉచితం..**

గతంలో 2014 - 19 మధ్య ఎస్సీ,ఎస్టీలకు టీడీపీ ప్రభుత్వం 100 యూనిట్లు మాత్రమే ఉచితంగా ఇవ్వగా... 2019 - 24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 200 యూనిట్లు ఉచితంగా అందించిందని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 15,29,017 ఎస్సీ కుటుంబాలకు సుమారు రూ.2,361.95 కోట్లు.. 4,57,586 ఎస్టీ కుటుంబాలకు రూ. 483.95 కోట్ల రుపాయల విలువ చేసే విద్యుత్ ఉచితంగా అందజేసిందని చెప్పారు. అయితే నేటి కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు వేలాది రూపాయల బిల్లులు వస్తున్నాయని ఆరోపించారు.

**పత్తా లేని పవన్..**

విద్యుత్ చార్జీలు పెంచబోమని.. ఒకవేళ పెంచితే ప్రశ్నిస్తానన్న పవన్‌కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి అయిన తర్వాత పత్తా లేకుండా పోయారని రాజన్నదొర ఆరోపించారు. జనసైనికులందరూ ఆయన ముఖ్యమంత్రి కావాలంటే.. ఆయన మాత్రం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండాలంటూ మాట్లాడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.



పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సాలూరు: ఏడీఈకి వినతిపత్రం అందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర



సాలూరు: విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

### మార్చి నుంచి మరింత బాదుడు..

శీతాకాలంలో విద్యుత్ వినియోగం తక్కువగా ఉన్నప్పుడే వేలాది రుపాయల బిల్లులు వస్తుంటే.. మార్చి నెల నుంచి మరింత బాదుడు గ్యారెంటీ అని రాజన్నదొర చమత్కరించారు. అనంతరం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏడీఈ గోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

### రెండు సార్లు పెంచారు...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా రెండు సార్లు విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచం అంటూ ఊదరగొట్టి సామాన్యులను మభ్యపెట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారు. ఇది సమంజసం కాదు.

– వి. గౌరీశంకర్, వినియోగదారుడు, పార్వతీపురం పట్టణం


### నయవంచక పాలన..



చంద్రబాబు తన నయవంచన పాలనను కొనసాగిస్తున్నారు. గతంలో ఎన్నికల ముందు పలు ప్రాంతాల్లో పర్యటించినపుడు విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని బూటకపు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తన నిజస్వరూపాన్ని చూపించారు. చార్జీల పెంపుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– అరసాడ కృష్ణారావు, గంగాడ గ్రామం

### ఓట్లు వేసినందుకు అనుభవిస్తున్నారు..



ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన బూటకపు హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారు. ఇప్పుడు దాని ఫలితం అనుభవిస్తున్నారు. అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పేరుతో వైఎస్సార్‌సీపీ కన్నా మంచి సంక్షేమాన్ని అందిస్తామని చంద్రబాబు ప్రజలను నమ్మించారు. తీరా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో రెండుసార్లు విద్యుత్ చార్జీల భారం మోపి సామాన్యుడిని ఇబ్బంది పెట్టారు.

– తమ్మినాయుడు, వినియోగదారుడు, లచ్చయ్యపేట

## వినియోగదారులకు వెన్నుపోటు ..

- చార్జీలు తగ్గించే వరకూ పోరాటం ఆగదు : మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: విద్యుత్ వినియోగదారులకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కూడలి నుంచి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ.. ఊరూ వాడా బలపం కట్టుకుని చార్జీలు పెంచబోనంటూ ఊదరగొట్టిన చంద్రబాబు.. ఆరు నెలలు తిరగక ముందే ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. చార్జీల పెంపును ఉపసంహరించుకునేంత వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



విద్యుత్ శాఖ ఎస్ఈ చలపతిరావుకు వినతి ప్రతం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

**విద్యుత్ రంగాన్ని నిట్టనిలువునా ముంచేసింది చంద్రబాబే..**

విద్యుత్ రంగాన్ని నిట్టనిలువునా ముంచేసిన ఘనత చంద్రబాబుదేనని జోగారావు ఎద్దేవా చేశారు. కరెంటు చార్జీల షాక్ నుంచి తేరుకోక ముందే రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, వినియోగదారులు పాల్గొన్నారు.

### నెరవేర్చకపోవడం బాబు నైజం..



ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడం చంద్రబాబు నైజం. ప్రతి ఎన్నికలోనూ ఇదే పద్ధతి. 2014లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో 2019లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పారు. 2024 మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారు. హామీలు అమలు చేయకపోతే 2029లో బుద్ధి చెప్పకతప్పదు.

– వేణుగోపాల్, వినియోగదారుడు, చిలకలపల్లి

### భారం తగదు...



విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం తగదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తప్పనిసరిగా తగ్గించాల్సిందే. సూపర్ సిక్స్ హామీలకు ఆశ పడితే జేబుకు చిల్లు పడుతోంది. వినియోగదారుల నిరసనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి.

– ఎం. తాతబాబు, వినియోగదారుడు, నారాయణపురం

### చార్జీలను తక్షణమే తగ్గించాలి..



కూటమి ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలి. పేద, మధ్య తరగతి ప్రజలు విద్యుత్‌భారం మోయలేకపోతున్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాటమార్చడం తగదు.

– రెడ్డి సురేష్, వైస్ ఎంపీపీ, సాలూరు మండలం

### రూ. 15 వేలు బిల్లు వచ్చింది..



దళిత కౌన్సిలర్ అయినా నాకు 14,905.60 రుపాయల విద్యుత్ బిల్లు వచ్చింది. అంత డబ్బులు చెల్లించుకునే పరిస్థితి మాకు లేదు. దళితులు, గిరిజనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను మళ్లీ అమలు చేయాలి.

– సింగారపు ఈశ్వరరావు, బాధిత వినియోగదారుడు, సాలూరు మున్సిపాలిటీ

## మన్మోహన్ ఓ మేరు పర్వతం..

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- మాజీ ప్రధానికి ఘనంగా నివాళులు..



సాలూరు: మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీడిక రాజన్నదొర, తదితరులు

సాలూరు: దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఓ మేరు పర్వతమని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికవేత్తగా.. ప్రధానిగా ఆయన దేశ ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. 1972లో ప్రధానమంత్రికి ఆర్థిక సలహాదారుడిగా, 1991లో ఆర్థిక శాఖా మంత్రిగా పనిచేశారన్నారు. ఎవ్వరితోనూ వివాదాల్లేని ఆయన వ్యక్తిత్వం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**దేశానికి తీరని లోటు : అలజంగి**

పార్వతీపురం టౌన్: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జోగారావు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ ఆర్‌బీఐ గవర్నర్ నుంచి ప్రధాని వరకు ఎదిగి దేశ ప్రజలకు విలువైన సేవలందించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**రాజనీతిజ్ఞుడు**

బలిజిపేట: పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు గ్రామస్తులు నివాళులర్పించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. దేశ ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎంతో మహోన్నతమైన వ్యక్తిని కోల్పోయామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.వెంకటరావు, మహేష్, పి.సురేష్, కిరణ్, శ్రావణ్‌కుమార్, గౌరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, తదితరులు



బలిజిపేట: పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

## చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సాలూరు జూనియర్ కోర్టు సివిల్ జడ్జి రమేష్

మక్కువ: గృహహింస, మహిళలపై లైంగిక వేధింపుల చట్టాలపై సాలూరు జూనియర్ కోర్టు సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె. రమేష్ అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక వెలుగు మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘ సభ్యులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహం చేయడానికి ప్రయత్నిస్తే పోలీస్‌శాఖ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏదైనా కేసులో అరెస్ట్ చేయడానికి పోలీసులు ఇంటికి వస్తే ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో తెలుసుకోవాలన్నారు. న్యాయసేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు తాడ్డి. తిరుపతి, సీనియర్ న్యాయవాది వీహెచ్‌కే శర్మ, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, వెలుగు ఏపీఎం జయకుమార్ పాల్గొన్నారు.

## గురువులు లేరు.. ఇళ్లకు విద్యార్థులు..



పాఠశాలకు విద్యార్థులను తీసుకువచ్చిన తల్లిదండ్రులు

- జోగింపేట ప్రతిభా పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థులు
- అప్రమత్తమైన సిబ్బంది
- తిరిగి చేరుకుంటున్న విద్యార్థులు

సీతానగరం:

మండలంలోని జోగింపేట గ్రామంలో ప్రతిభ (స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల అనుమతి లేకుండా క్రిస్మస్ పండగ సందర్భంగా ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో సిబ్బంది స్పందించి విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యాలయంలో 17 మంది ఉపాధ్యాయులున్నారు. ఇందులో ఆరుగురు రెగ్యులర్ కాగా.. 11 మంది అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారు.

అయితే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు కొద్ది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈక్రమంలో తరగతులు సక్రమంగా జరగకపోవడం, క్రిస్మస్ పండగ నేపథ్యంలో విద్యార్థులు ఎవ్వరికీ చెప్పకుండా ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో ప్రిన్సిపాల్ ధర్మరాజు వెంటనే స్పందించి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి విద్యార్థులను స్కూల్‌కు పంపించాలని అభ్యర్థిస్తున్నారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు తీసుకువస్తున్నారు. శుక్రవారం కూడా పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకు వచ్చారు.

### చెప్పే వచ్చాడు ..



మా కుమారుడు స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. క్రిస్మస్ పండగ నేపథ్యంలో 20వ తేదీన ఇంటికి వచ్చాడు. తోటి స్నేహితులతో వస్తున్నాని చెప్పే వచ్చాడు. ప్రిన్సిపాల్ నుంచి ఫోన్ రావడంతో తిరిగి పాఠశాలకు తీసుకువచ్చాం.

– వల్లంకి కొండలరావు, గుంపరాయి, పెదబయలు మండలం

### వస్తున్నారు..



క్రిస్మస్ పండకు వెళ్లిన విద్యార్థులు తిరిగి పాఠశాలకు చేరుకుంటున్నారు. కొంతమంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు తీసుకువస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ధర్నాలో ఉన్నప్పటికీ, తరగతుల నిర్వహణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ధర్మరాజు, ప్రిన్సిపాల్, స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, జోగింపేట, సీతానగరం మండలం

### పార్వతీపురం వరకు ట్రైన్ పొడిగింపు

పార్వతీపురం టౌన్: విశాఖ – విజయనగరం– పలాస– విజయనగరం ట్రైన్‌ను పార్వతీపురం వరకు పొడిగిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ట్రైన్ సౌకర్యం ఉంటుందని స్థానిక రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలో రాత్రి 19:55 గంటలకు బయలు దేరి పార్వతీపురం రాత్రి పది గంటలకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి పార్వతీపురంలో ఉదయం నాలుగు గంటలకు బయలు దేరి విజయనగరం ఆరు గంటకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

### సమన్వయంతో పనిచేయాలి

సీతానగరం: కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు అధ్యక్షతన ఉపాధ్యాయులు, వైద్యారోగ్య, ఐసీడీఎస్, పోలీస్, వెలుగు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల్లో రక్తహీనత నివారణకు, శిశుమరణాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్‌పీ రమణ, ఎంఈఓ జి. సూరిదేముడు, సీడీపీఓ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.